పెండింగ్ పనులు పూర్తి చేయండి

అధికారులను ఆదేశించిన అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, అక్టోబర్ 30 : అంబర్‌పేట నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. బుధవారం గోల్నాకలోని క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు, కొత్తగా చేపట్టవలసిన పనులు, మధ్యంతరంగా ఆగిపోయిన పనుల విషయమై చర్చించారు. అనంతరం కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఏఈలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈలు ప్రశాంతి, సంజయ్, ఏఈలు పృథ్వీ, పవన్, శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు నరేందర్, రవి, మనోహర్, రాము, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్


దీపావళి పండుగను నిర్వహిస్తున్న భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, సిబ్బంది

రెడ్‌బిల్డింగ్ చౌరస్తాలో.. కార్పొరేటర్ బి.పద్మ, ఏఎంఓహెచ్ డా.హేమలత

సకల శుభాలు కలగాలి

తెలంగాణ భాషా సాంస్కృతిక సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ

రవీంద్రభారతి/అంబర్‌పేట ,అక్టోబర్ 30: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ కార్యాలయంలో బుధవారం తెలంగాణ భాషా సాంస్కృతిక సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ రవీంద్రభారతిలో దీపావళి పండుగ పూజలు నిర్వహించారు.అనంతరం డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ దీపావళి పండుగ చెడును పారద్రోలి మంచిని పెంపొందించడం మానవాళికి నిజమైన దీపావళి పండుగని చెప్పారు.అనంతరం ఆయన కార్యాలయంలో లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రఘునందన్, విజయ్‌కుమార్, ప్రసాద్,శ్రీనివాస్,ఆకుల రవి కుమార్,హేమలతారెడ్డి, స్రవంతి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాగ్‌అంబర్‌పేటలో..

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేట డివిజన్ రెడ్‌బిల్డింగ్ చౌరస్తాలో బుధవారం స్వచ్ఛ దివాళి- శుభ దివాళిని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి హాజరయ్యారు. అనంతరం ముగ్గులు వేసి దివ్వెలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డా.హేమలత, శానిటరీ సూపర్‌వైజర్లు హరినాథ్‌గౌడ్, ఆదిల్, ఆంజనేయులు, నరసింహ, కాశ్వారెడ్డి, మేకల శ్రీనివాస్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

18 నుంచి 20 వరకు బొడ్రాయి పునఃప్రతిష్ఠ

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు

అంబర్‌పేట, అక్టోబర్ 30 : అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో నవంబర్ 18 నుంచి 20 వరకు అంబర్‌పేట బొడ్రాయి పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. బుధవారం అంబర్‌పేట మహంకాళి దేవాలయంలో బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి ప్రధాన సలహాదారుడు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, అధ్యక్షుడు వై.శంకర్‌గౌడ్, చైర్మన్ పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, వైస్ చైర్మన్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్, అంబర్‌పేట బొడ్రాయి పునఃప్రతిష్ఠ నిర్మాణ కమిటీ కన్వీనర్ సి.శ్రీనివాస్‌ముదిరాజ్ తదితరులు మాట్లాడుతూ అంబర్‌పేట మెయిన్ రోడ్డులో ఉన్న బొడ్రాయి ఫ్లై ఓవర్ నిర్మాణం కిందకు రావడంతో బొడ్రాయిని పక్కనే ఉన్న స్థలంలో పునఃప్రతిష్ఠించడం జరుగుందని తెలిపారు. నవంబర్ 6న భూమి పూజ నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కమిటీ కన్వీనర్ పి.గిరిధర్‌గౌడ్, కార్యదర్శి చెంగలి సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శి డి.కిశోర్, కోశాధికారి గడ్డం శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సదర్ వేడుకలకు ఆహ్వానం

యాదవులు భక్తి శ్రద్ధలతో ప్రతి ఏడాది నారాయణగూడలో నిర్వహించే సదర్ వేడుకల్లో రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. నవంబర్ 2 న నారాయణగూడలో వైభవంగా నిర్వహించే సదర్ ఉత్సవాలకు రావాలని చిట్టబోయిన వినోద్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని మార్యాద పూర్వకంగా కలిసి నారాయణగూడలో నిర్వహించే సదర్ ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు.-కాచిగూడ,అక్టోబర్ 30

బీసీ కులగణనపై చర్చ..
కార్వాన్ నియోజకవర్గంలో బీసీ కులగణన ప్రక్రియపై బుధవారం జీహెచ్ఎంసీ సర్కిల్-13 డిప్యూటీ కమిషనర్ శశిరేఖ ,ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్‌తో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో చేపడుతున్న కులగణన గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు,నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్ పాల్గొన్నారు.
- మెహిదీపట్నం అక్టోబర్ 30

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కార్మికులతో చర్చిస్తున్న దృశ్యం

మెహిదీపట్నం అక్టోబర్ 30 : ప్రభుత్వం కార్మికుల కోసం అమలు చేసే సంక్షేమ పథకాలను కార్మికులు తెలుసుకుని లబ్ధి పొందాలని లీగల్‌సెల్ స్పెషల్ అథారిటీ సభ్యులు ,భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు పి,రామారావు అన్నారు. లంగర్‌హౌస్ కూలీల అడ్డాపై కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలను కూలీలకు వివరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని రామారావు సూచించారు.

ఫుట్‌పాత్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

సైదాబాద్ : ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని భూలక్ష్మి ఆలయం వద్ద రూ. 4 లక్షల వ్యయంతో చేపట్టిన ఫుట్‌పాత్ నిర్మాణ పనులను బుధవారం డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత ప్రారంభించారు. ఫుట్‌పాత్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రమాదాలు నివారించడం..డ్రైవర్లతోనే సాధ్యం

నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్

కాచిగూడ,అక్టోబర్ 30: దేశంలోనే ఆర్టీసీ పెద్ద సంస్థ అని నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ (ఐపీఎస్)పి.విశ్వప్రసాద్ అన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కాచిగూడ ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథులుగా నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ , ఈస్ట్‌జోన్ ఏసీపీ సంపత్‌కుమార్,హైదరాబాద్ ఆర్టీసీ ఆర్ఎం వరప్రసాద్, డిప్యూటీ ఆర్ఎం(మెకానికల్)జి.జగన్,డిప్యూటీ ఆర్ఎంఓ బాబునాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా విశ్వప్రసాద్ మాట్లాడుతూ ప్రతిరోజూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో 88 లక్షల వాహనాలు రోడ్డుపై తిరుగుతున్నాయని, ప్రతిరోజూ 14 వందల వాహనాలను ప్రజలు కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాలు నివారించడం కేవలం డ్రైవర్లతోనే సాధ్యమని, అప్రమత్తంగా ఉంటూ డ్రైవర్లు డ్రైవింగ్ చేస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని సూచించారు. రవాణ రంగం ప్రజలకు గుండె కాయలాంటిదన్నారు. రాబోయే రోజులలో ప్రజలకు మరింతగా చేరువలో సేవలు అందించేది ట్రాఫిక్ పోలీసులేనని ఆయన పేర్కొన్నారు. ప్రమాదాలు జరుగకుండా బస్సులు నడిపిన డ్రైవర్లను సన్మానించి, మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ డిపో మేనేజర్ టి.రఘు, కాచిగూడ ట్రాఫిక్ సీఐ ఎ.శ్రీనివాస్, చిలకలగూడ ట్రాఫిక్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు, అయోధ్య రాములుతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నగర అడిషనల్ కమిషనర్ ట్రాఫిక్ విశ్వప్రసాద్ తదితరులు

టెన్నిస్‌లో అండర్ -16 ఏషియన్ టోర్నామెంట్ విజేత రంగినేని కీర్తన

అంబర్‌పేట, అక్టోబర్ 30: అంబర్‌పేట డీడీ కాలనీకి చెందిన రంగినేని కీర్తన అండర్-16 టెన్నిస్‌లో ఏషియన్ టోర్నమెంట్ విజేతగా నిలిచింది. ఈ నెల 25న అగర్తాల దేశంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో కీర్తన ఏషియన్ టైటిల్ గెలిచింది. నాలుగు సంవత్సరాలుగా విరామం లేకుండా కీర్తన టెన్నిస్ ప్రాక్టీస్ చేస్తున్నది. మెట్టుగూడలోని రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో మహ్మద్ హబీబ్ అండ్ బ్రదర్స్ వద్ద కోచింగ్ తీసుకుంటున్నది. దేశం తరపున ఈ పోటీల్లో పాల్గొన్న కీర్తన ఈ టైటిల్ నెగ్గడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పరిసరాల పరిశుభ్రతపై అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ జాఫర్‌ఖాన్

మెహిదీపట్నం అక్టోబర్ 30: నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లో పరిశుభ్రత కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ సర్కిల్ -12 ఏఎంఓహెచ్ డాక్టర్ ఎజాజ్ ఖాసీం మల్లేపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా పరిశుభ్రత కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి జాఫర్ ఖాన్ డాక్టర్ ఎజాజ్ ఖాసీంకు వివరించారు.

అన్నదానం విలువైనది

అన్ని దానాలలో ఎంతో విలువైన దానం అన్నదానమని టీఎన్జీవో కేంద్ర సంఘం మారం జగదీశ్వర్ అన్నారు.ఈ మేరకు బుధవారం అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానలో సుమారు 600 మంది పేద రోగి సహాయకులకు అన్నదానం చేశారు. టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ మాట్లాడుతూ తాను బతికినంత కాలం పేద రోగి సహాయకులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు,నగర శాఖ అధ్యక్షులు కట్కూరి శ్రీకాంత్,కేంద్ర సంఘం క్రీడా కార్యదర్శి బొలిగిద్ద శంకర్,హైదరాబాద్ జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, జిల్లా శాఖ ఉపాధ్యక్షులు కురాడి శ్రీనివాస్,సంయుక్త కార్యదర్శి ఖాలేద్ అహ్మద్,వీఆర్‌వో మహ్మద్ వహీద్,క్యాన్సర్ దవాఖాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- సుల్తాన్‌బజార్,అక్టోబర్ 30

అంకిత భావంతో పని చేసినప్పుడే గుర్తింపు


కార్యక్రమంలో పాల్గొన్న ఈడీఓ మునిశేఖర్, సీఏఓ గీత, ఏఓ రంగారావు తదితరులు

ఆర్టీసీ ఈడీఓ మునిశేఖర్

కాచిగూడ,అక్టోబర్ 30: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసినప్పుడే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని ఆర్టీసీ ఈడీఓ మునిశేఖర్ అన్నారు. ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ (ఫైనాన్స్)గా పదవీ విరమణ చేసిన తొగిటి గోవర్ధనాచారిని బుధవారం కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సన్మానించారు.అనంతరం ఈడీఓ మునిశేఖర్ మాట్లాడుతూ ఆర్టీసీలో సేవలు అందించి ఉద్యోగుల మన్ననలు పొందిన పదవీ విరమణ చేయడం గొప్ప విషయమని,చారి చేసిన సేవలు ఆర్టీసీ సంస్థ ఎప్పటికి మరచిపోదన్నారు. అంకిత భావంతో పనిచేసి ఉద్యోగులకు, కార్మికులకు అన్ని విధాలుగా సన్నిహితంగా ఉంటనే పూర్తి సమాచారం సేకరించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఏఓ గీత,ఏఓ పీవీ రంగారావు, విటోభా,సంధ్య, మగ్బుల్ పాషా,శోభన్‌బాబు,పద్మావతి,రమణ, నర్సయ్య, శ్రీనప్ప, రాజేశ్, స్వరూప, లక్ష్మి, చంద్రకళ, రమాదేవి, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్‌గౌడ్

రవీంద్రభారతి,అక్టోబర్ 30: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు 42 శాతం పెంచాలన్నా , ఇతర విద్యా ఉద్యోగాల్లో బీసీల వాటా పెరగాలన్నా ఈ సమగ్ర కులగణనతోనే నిర్ణయించబడుతోందని, అధికారులు ప్రజలు అంకితభావంతో ముందుకెళ్లాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ అన్నారు.బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న మొదటి కులగణన సర్వే ఈ సర్వేను బీసీ కమిషన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలబడాలన్నారు.సమగ్ర కులగణనపై ఊరూరా దండోరా వేయించాలన్నా రు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 30: ఓయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్, మేకప్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి వచ్చే నెల 4వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 6వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంతటా దీపావళి సందడి

కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న మార్కెట్లు

దీపావళిని పురస్కరించుకొని అంబర్‌పేటలో దొంతులు అమ్మతున్న కుమ్మరులు

కొలువుదీరిన బొమ్మల కొలువు

అంబర్‌పేట, అక్టోబర్ 30 : అంబర్‌పేట అంతటా దీపావళి సందడి నెలకొంది. నియోజకవర్గంలోని బస్తీలు, కాలనీల్లో పండుగ వాతావరణం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ముఖ్యంగా దుకాణాలు, షాపింగ్ మాల్స్, వ్యాపార సముదాయాలు కొత్త అందాలతో కనువిందు చేస్తున్నాయి. దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రధాన ప్రాంతాల్లో పటాకుల దుకాణాలు వెలిశాయి. దుకాణాల వద్ద కొనుగోలు దారులతో రద్దీగా మారింది. దీపావళి ఈసారి పెద్ద ఎత్తున జరుపుకునేందుకు అంతా సిద్ధమయ్యారు. దీపావళి నోములు, వ్రతాలు చేసుకునే వారు బంతి పూలు, గుమ్మడికాయ, అరటిచెట్లు, దొంతులు, బొమ్మలు కొనుగోలు చేయడానికి మార్కెట్లకు రావడంతో ఒక్కసారిగా మార్కెట్లు కిటకిటలాడాయి. గోల్నాక మార్కెట్, తిలక్‌నగర్ మెయిన్‌రోడ్డు, బతుకమ్మకుంట, శివంరోడ్డు, శంకరమఠం రోడ్డు, నల్లకుంట కూరగాయల మార్కెట్, బర్కత్‌పుర, చప్పల్ బజార్, నారాయణగూడ, ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పటాకుల దుకాణాలు వెలిశాయి. అదేవిధంగా పూల విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయి. వీటికి తోడు మిఠాయిల దుకాణాలు, తెలంగాణ పిండి వంటల దుకాణాల వద్ద కూడా కొనుగోలుదారులతో రద్దీ నెలకొంది. ఈసారీ పటాకుల ధరలు బాగా పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు వాటిని కొనుగోలు చేసే పరిస్థితి కనిపించడంలేదు. వారి ఇళ్లలో బొమ్మల కొలువులను ఏర్పాటు చేశారు. గురువారం దీపావళికి అంతా సిద్ధమయ్యారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ,అక్టోబర్ 30: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తి(40) బుధవారం ఫలక్‌నామ-శివరాంపల్లి రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని వివరాల కోసం 9494824 535లో సంప్రదించాలని కోరారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ ఫ్యాషన్ డిజైన్ మేనేజ్‌మెంట్, బీబీఏ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, బీబీఏ లాజిస్టిక్స్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీకామ్, బీకామ్ ఆనర్స్ తదితర కోర్సుల మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 19నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోవచ్చన్నారు.

ఉప్పల్ కురుమ సంఘం కమిటీ ఎన్నిక

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డిని సన్మానిస్తున్న ఉప్పల్ నూతన కమిటీ ప్రతినిధులు

కార్వాన్, అక్టోబర్ 30 : ఉప్పల్ కురుమ సంఘం నూతన కమిటీని ఉప్పల్ కురుమ సంఘం ప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేసి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిందం వెంకటేష్ కురుమ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బర్ల కృష్ణ కురుమ, ఉపాధ్యక్షులుగా కొండ్ర హనుమంతు కురుమ, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర శ్రీనివాస్ కురుమ, కర్రె శ్రీనివాస్ కురుమ, కోశాధికారిగా శాగ పెంటయ్య కురుమలు ఎన్నికయ్యారు. అదే విధంగా ఉప్పల్ కురుమ యువత కమిటీ అధ్యక్షుడిగా ముత్యగారి రాకేష్ కురుమ, ప్రధాన కార్యదర్శిగా కరికే మహేష్‌లు ఎన్నికయ్యారు. ఉప్పల్ కురుమ మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలిగా లత కురుమ, ప్రధాన కార్యదర్శిగా కెమిడి ఇందిరా కురుమలు ఎన్నికయ్యారు.

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి సన్మానం

ఉప్పల్ కురుమ సంఘం నూతన కమిటీ ప్రతినిధులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ..బీరప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం ఏర్పాటుకు ఎమ్మెల్యే సహాయం అందజేస్తానని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.

సదర్ వేడుకలకు బాహుబలి దున్నరాజు

కాచిగూడ,అక్టోబర్ 30: యాదవ సోదరులు ప్రతిష్టాత్మకంగా నవంబర్ 2న నారాయణగూలో నిర్వహించే సదర్ ఉత్సవాలకు దున్నలను ముస్తాబు చేస్తున్నారు. బుధవారం కాచిగూడ చెప్పల్ బజార్‌లో సదర్ వేడుకల కోసం హర్యానా, ఉత్తర ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి దున్నలతో మహా ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా చెప్పల్‌బజార్ యాదవ సంఘం ప్రతినిధులు లడ్డూయాదవ్, సందీప్‌యాదవ్ మాట్లాడుతూ సదర్ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.సదర్ వేడులకల కోసం ప్రత్యేకంగా 9 దున్నలను వివిధ రాష్ట్రాల నుంచి తీసుకువచ్చినట్లు వెల్లడించారు.బాహుబలి దున్నరాజుకు 3 కిలోల బంగారు గొలుసును వేసినట్లు.. అదే సదర్ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నదన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ,అక్టోబర్ 30: మనస్థాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై జి.సురేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బర్కత్‌పుర మహతినికేతన్ అపార్ట్‌మెంట్‌కు చెందిన చింతలపుడి రవికిరణ్(44) తాగుడుకు బానిసయ్యాడు. బుధవారం తాగిన మైకంలో జీవితంపై విరక్తి చెంది మనస్థాపంతో ఇంట్లో సిలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న కాచిగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రవికిరణ్ మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ పోలీసులు తెలిపారు.

FORM NO. 2 SUMMONS FOR SETLEMENT OF ISSUES IN THE COURT OF THE VIII JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURT AT : HYDERABAD
O.S.No. 3406 of 2021

Between:
G. Jagadhambha ...Plaintiff
AND
Smt. G. Kausalya and others ...Defendants

To
1. Sri G.Srinivas, S/o. Late G.Nagappa, Aged about 40 Years, Occ: Govt. Employee, R/o. H.No. 19-1-157.160 and 163, Chataknipura, Umda Bazar, Dood Bowli, Hyderabad-T.S. and also at H.No. 9-1-126/2/1, Kalidaspura, Rethi Bowli, Hyderabad. **(D2)**
2. Smt. Sujatha, W/o. Prabhakar, Aged about 38 Years, Occ: Household, R/o. H.No. 9-1-126/2/1, Kalidaspura, Rethi Bowli, Hyderabad T.S. **(D3)**

Whereas the above-named plaintiff has instituted a suit against you and others for partition, you are hereby summed to appear in this Court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit on the 13th day of November 2024 at 10.30 O'clock in the forenoon. Take notice that in default of your appearance and to file your written statement within 30 days the suit will be heard and determined in your absence.
//BY THE ORDER OF COURT//
K.MANOHAR BABU, Advocate
Plot No. 290, Satyanagar Colony, Kothapet, Hyderabad, T.S.